

దేవాలయాల్లో ప్లాస్టిక్‌కు చెక్

- ఉత్తర్వులు జారీచేసిన దేవదాయ శాఖ కమిషనర్
- సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

6లో



ఆదివాసీ సంబరం

- జిల్లాలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం
- ఐటీడీఏల వేదికగా నిర్వహణ
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- భాగస్వాములైన అధికారులు, ప్రజాప్రతినిధులు


సీతంపేటలో గిరిజన కళాకారులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పార్వతీపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ కేంద్రాలుగా శనివారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ థింసా నృత్యం, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. అడవితల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇన్‌చార్జి పీవోలు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు అంబరాన్నంటాయి. మొత్తంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలు నిర్వహించారు.

ఆదివాసీ హక్కులను పరిరక్షించాలి

ఆదివాసీల హక్కులను గుర్తించి వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..


పార్వతీపురంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి


పార్వతీపురం ఐటీడీఏలో వేడుకలను తిలకిస్తున్న గిరిజనులు, చిన్నారులు

'ఆదివాసీ వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రభుత్వం అందించే పథకాలపై వారికి అవగాహన కల్పించాలి.' అని సూచించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. కొంతమంది ఆదివాసీలు సారా, గంజాయి రవాణాలో భాగస్వాములవడం వల్ల మిగిలిన వారికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. ఎవరూ చెడు వ్యసనాలకు బానిస కారాదని పిలుపు నిచ్చారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. ఆదివాసీలకు కష్టపడే

(మిగతా 8వ పేజీలో...)

మట్టిలో మాణిక్యాలు గిరిజనులు : కలెక్టర్

సీతంపేట రూరల్: గిరిజనులు మట్టిలో మాణిక్యాలు అని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ నుంచి ఐటీడీఏ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అడవితల్లి విగ్రహానికి పూజలు నిర్వహించి.. పాలభిషేకం చేశారు. అంతకుముందు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణలు కళాకారులతో కలిసి థింసా నృత్యం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో వివిధ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..' జిల్లాలో 33 శాతం గిరిజనులు ఉన్నారు. వారిలో లక్ష మంది పైబడి పీవీటీజీలు ఉన్నారు. వారి సర్వతోముఖాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటాం. సీతంపేటలో ఎన్నో జలపాతాలు, కొండలు, వాగులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో స్వచ్ఛమైన మనసున్న అమాయక గిరిజనులను ప్రభుత్వం ఎన్నో రకాలుగా ఆదుకుంటోంది. టూరిజం అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నాయి. విద్యార్థులు చదువుల్లో రాణించాలి.' అని తెలిపారు.

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. 'ఉన్నత స్థానాలు అధిరోహించడానికి చదువు ఒక్కటే మార్గం. గిరిజన ప్రాంతాల్లో రోడ్డు, తాగునీటి వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఫీడర్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తెచ్చిన ఘనత కూటమికే చెందుతుంది. త్వరలో సీతంపేట సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది.' తెలిపారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందించారు. ఏపీవో చిన్నబాబు, డీఎస్పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి గ్రీన్‌సిగ్నల్


తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం

గరుగుబిల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన దేవాలయాల్లో ధర్మకర్తల మండలి నియామకాలకు దేవదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మన్యంలో తోటపల్లిలో వేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానం, పాలకొండ కోటదుర్గమ్మ ఆలయం, మక్కువ మండలంలో శంబర పోల మాంబ దేవాలయాల్లో సభ్యుల నియామకాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రెండు రోజుల్లో ఆయా ఆలయాలు, పంచా యతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో నోటిఫి కేషన్ ప్రతులను ఉంచాలి. దేవాలయాల పరిధిలోని సమాచార సేకరణకు ప్రత్యేకాధికారులను నియమించారు. అర్హులైన వారి దరఖాస్తుల పరిశీలన తర్వాత నియామకం చేపట్టనున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియామకమైన ధర్మకర్తల మండలి సభ్యులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీనామాలు చేశారు. ఈ నేపథ్యంలో ఏడాది తర్వాత నియామకాలకు చర్యలు చేపట్టారు.

నోటిఫికేషన్ విడుదల

సెక్షన్ 15కు అనుగుణంగా 30/87 యాక్ట్ మేరకు నోటీసులు ప్రచురించిన 20 రోజుల్లోగా సంబంధిత దేవాలయాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంది. ధార్మిక పరిషత్ నియమ నిబంధనల మేరకు దరఖాస్తు చేసు కున్న వ్యక్తుల పూర్వాపరాలను నిశితంగా సేకరించి నివేదికలు అందించాలని రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధికారులకు సూచించారు. నేర ప్రవృత్తి విషయాలను కూడా పొందుపర్చాల్సి ఉంది.

6ఏ విభాగంలో మూడు దేవాలయాలు

దేవదాయశాఖ నిబంధనల మేరకు రూ.50 లక్షలు పైబడి ఆదాయం వచ్చే ఆలయాలను 6ఏగా పరిగణిస్తారు. ఈ మేరకు పాలకొండ కోట దుర్గమ్మ దేవాలయానికి సంబంధించి ఏడాదికి రూ. కోటి పైబడి వస్తుంది. శంబర పోలమాంబ ఆలయానికి కూడా రూ. కోటికి పైబడి ఆదాయ వనరులు ఉన్నాయి. తోట పల్లి దేవస్థానానికి కూడా రూ. 50 లక్షలు పైబడి ఆదాయం వస్తుంది. దీంతో

(మిగతా 8వ పేజీలో...)


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాఖీ కడుతున్న మంత్రి సంధ్యారాణి

రాఖీ కట్టి.. ఆశీర్వాదం పొంది..

పార్వతీపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాఖీ కట్టడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాని.. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రికి ఆమె రాఖీ కట్టి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాఖీ పండగ సందర్భంగా సీఎం చంద్రబాబుకు రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇది మరువలేని రోజు అని తెలిపారు. 'గిరిజనుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. గతంలో తమ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్-3పై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గిరిజనులకు ఇబ్బందులు లేకుండా దాని స్థానంలో ప్రత్యామ్నాయ జీవోను తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది. గిరిజన యూనివర్సిటీని త్వరగా పూర్తి చేస్తామని, డోలీలు మోత లేకుండా రహదారులు నిర్మించాలని, నిధులు మంజూరుకు వెనకాడేది లేదని, ముఖ్య మంత్రి ప్రకటించడం హర్షణీయం.' అని తెలి పారు. ఆదివాసీలపై ఉన్న అభిమానాన్ని సీఎం చాటుకున్నారని మంత్రి సంధ్యారాణి శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో వెల్లడించారు.

స్పీడ్ బ్రేకర్లు లేవు.. పర్యవేక్షణ లేదు

- హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయని వైనం
- ఇదీ మలుపుల్లో పరిస్థితి



8లో

రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెంచాలి

- రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

బెలగాం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో అవసరమైన చోట ఉద్యోగుల సంఖ్యను పెంచితే మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పార్వతీపురంలో విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ.. మెరుగైన, వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సాంకేతికతలో మార్పులు చోటు చేసుకున్నాయని, రెవెన్యూ అకాడమీ పెట్టి ఉద్యోగు లకు శిక్షణ ఇస్తే ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో 108 తహసీల్దార్, 26 ఆర్డీవో కార్యాలయాల కొరత ఉందని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

1 నుంచి కొత్త బార్లు

- నెలాఖరుకు పాతవాటి గడువు పూర్తి
- పది రోజుల్లో నోటిఫికేషన్ రాక
- వచ్చే నెలలో లాటరీ ద్వారా కొత్తవి..
- ఉమ్మడి జిల్లాలో 34 బార్లకు డ్రా



రాజాం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బార్లుకు ఇచ్చిన మూడేళ్ల గడువు ఈ నెలాఖరుతో పూర్తికానుంది. వచ్చే నెల నుంచి కొత్త బార్లు రానున్నాయి. వీటిని లాటరీ ద్వారా అధికారులు ఎంపిక చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 34 బార్లుకు డ్రా చేపట్టనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలైన మద్యం పాలసీ మేరకు లైసెన్స్ పొందిన బార్లకు (2022-25) ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. కొత్తగా బార్లు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం నూతన మద్యం బార్లు విధానానికి రూపకల్పన చేసింది. దీనికి మంత్రిమండలి సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నూతన పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం బార్లు కేటాయించనున్నారు. జిల్లాలో 26, మన్యం జిల్లాలో 8 బార్లను లాటరీ ద్వారా కేటాయించనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదు. మరో పదిరోజుల్లో బార్లు కేటాయింపునకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడనుంది.

నాడు ఉదయం ఓ ధర.. మధ్యాహ్నం ఓ ధర

వైసీపీ ప్రభుత్వ హయాంలో బార్లలో ధరలకు తెరలేపారు. ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తూ మద్యంప్రియుల జీవితాలతో ఆటాడుకున్నారు. ఉదయం ఓ ధర, మధ్యాహ్నం మరో ధర, రాత్రి పొద్దుపోయాక ఇంకో ధరకు అమ్మకం చేస్తూ సొమ్ము చేసుకున్నారు. మద్యం షాపులు సైతం ప్రభుత్వమే నిర్వహించడంతో షాపులు తెరిచి, మూసే సమయాలను ఎప్పటికప్పుడు మారుస్తూ సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం మోపేలా వ్యవహరించారు. షాపుల్లో సైతం ఎప్పటికప్పుడు ధరలను పెంచుతూ సామాన్యుడి నడ్డి విరగొట్టేలా ప్రవర్తించారు. బార్లలో బీరుపై రూ.50 క్వార్టర్ బాటిల్‌పై రూ.50, హాఫ్‌పై రూ.100, ఫుల్‌బాటిల్‌పై రూ.200 నుంచి రూ.300 అదనంగా వసూలు చేసే పరిస్థితి. రాత్రి తొమ్మిది గంటలకే మద్యం షాపులకు తాళాలు పడడం, తెరిచి ఉన్న సమయంలో కూడా మంచి బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో మందుబాబులు బార్లును ఆశ్రయించేవారు. ఇదే అదనుగా ధరలను అప్పటికప్పుడు అమాంతం పెంచి అమ్మకాలు సాగిస్తూ ఐదేళ్ల పాటు దందా సాగించారు. అప్పట్లో నెలకొన్న పరిస్థితులు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. బార్లలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచే విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టనుంది. షాపుల్లో అమ్మకం చేస్తున్న ధరలపై రూ.10 నుంచి రూ.20కి మించకుండా బార్లలో అమ్మకాలు సాగేలా చూడనుంది.

కేటాయింపులోనూ దందా

బార్ల కేటాయింపులో గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించింది. భారీ ఆఫ్‌సెట్ ధరలను నిర్ణయించి మద్యం వ్యాపారుల మధ్య పోటీ పెంచింది. ఏమాత్రం డిమాండ్ లేని పట్టణాలలో కూడా లక్షలాది రూపాయలు

(మిగతా 8వ పేజీలో...)

గడువు ముగిసిన ఓఆర్ఎస్ తాగి అస్వస్థత

- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ.. కేసు నమోదు

7లో

రెవెన్యూ భవన నిర్మాణానికి శ్రీకారం

- పార్వతీపురంలో శంకుస్థాపన

6లో

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

రేపటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

- ఎమ్మార్సీలో ప్రశ్నపత్రాలు



6లో

వర్షం పడితే ఇంతేనా?


- జిల్లాకేంద్రంలో రోడ్డెక్కుతున్న మురుగు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


మేదరవీధి జంక్షన్‌లో నిలిచిన మురుగునీరు

పార్వతీపురం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వర్షం పడితే చాలు మురుగునీరు రోడ్డెక్కుతోంది. ఎక్కడి కక్కడ నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై ప్రజాప్రతినిధులు , అధికారులు స్పందించక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం పార్వతీపురంలో ఓ మోస్తరుగా వర్షం కురి సింది. దీంతో మేదరవీధి జంక్షన్‌తో పాటు అనేక వీధుల్లో మురుగునీరు నిలిచింది. రెడ్డి వీధి సమీపంలో రోడ్డుపైకి కూడా మురుగు నీరు ప్రవహించడంతో ఆయా ప్రాంత వాసులు నానా అవస్థలు పడ్డారు. జిల్లా కేంద్రంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొనడంతో పట్టణవాసులు పెదవివిరుస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఇలా మురుగునీరు నిలిచి పోవడంతో దుర్వాసన, దోమల కారణంగా తరచూ రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆవే దన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సందడిగా ఆదివాసీ దినోత్సవం

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


పార్వతీపురంలో అల్లూరి సీతారామరాజు వేషధారణలో విద్యార్థి


మహిళల కోలాట ప్రదర్శన


సీతంపేటలో థింసా నృత్యాలు చేస్తున్న గిరిజన విద్యార్థినులు


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విప్ జగదీశ్వరి, ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం/బెలగాం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం ఐటీడీఏ వేదికగా శనివారం పలువురు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. భద్రగిరి తదితర గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, కళాకారులు, చిన్నారులు సంప్రదాయ థింసా నృత్యాలు, అల్లూరి సీతారామ రాజు వేషధారణలతో సందడి చేశారు. కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల పరిధిలోని గిరిజన పాఠశాలల, కళాశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

● సీతంపేట రూరల్: సీతంపేటలో శనివారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో గిరిజనులు థింసా, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఐటీడీఏ కార్యాలయం సమీపంలో ఉన్న సందెమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన గేటు వద్ద ఉన్న అడవి తల్లి విగ్రహానికి ఎజ్జ రోడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పాలభిషేకం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో వివిధ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు సాంస్కృతిక కళా నృత్య ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. అంతకు ముందు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణలు గిరిజన కళాకారులతో కలిసి డ్యాన్స్ చేశారు.




పార్వతీపురం ఐటీడీఏలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన


సీతంపేట రూరల్: వాలీబాల్ పోటీల్లో విజేతలతో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు


కరెన్సీ నోట్ల అలంకరణలో అలమండ ముత్యాలమ్మతల్లి

కరెన్సీతో ముత్యాలమ్మతల్లికి అలంకరణ

జామి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం సందర్భంగా జామిలోని ముత్యాలమ్మ తల్లిని కరెన్సీతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ బంధం

- జిల్లాలో సందడిగా రాఖీ పౌర్ణమి వేడుక
- సుదూరం నుంచి వచ్చిన అక్కలు, చెల్లెళ్లు

ఎక్కడో ఉన్న సోదరుల వద్దకు వెళ్లి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్న వారు కొందరైతే.. ఇతర రాష్ట్రాల్లో ఉన్నా పుట్టింటికి వచ్చి సోదరులతో ఆనందంగా గడిపిన వారు మరికొందరు! జిల్లాలో శనివారం రాఖీ పౌర్ణమి పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అక్కచెల్లెళ్లంతా వారి అన్నదమ్ముల కు రాఖీలు కట్టారు. చాలా దూరంగా ఉన్నవారు వీడియోకాల్ చేసుకుని ముచ్చట్లు చెప్పుకున్నారు. అనుబంధాలు, ఆత్మీయతలను నెమరు వేసుకున్నారు. ఈ వేడుకలో జిల్లాలోని పలు దుకాణాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో కూడా రద్దీ కనిపించింది.


రాఖీలు కడుతున్న సోదరీమణులు

నలుగురు సోదరీమణుల ఆశీర్వాదం..

బొబ్బిలి పట్టణానికి చెందిన పసుమర్తి కిశోర్‌కు నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరంతా శనివారం బొబ్బిలికి వచి కిశోర్‌కు రాఖీలు కట్టారు. రోజంతా సందడిగా గడుపుకున్నారు. చిన్ననాటి నుంచి గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

బెంగళూరు నుంచి వచ్చి..


అన్నకు రాఖీ కడుతున్న మానస

బొబ్బిలి, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పూల్‌బాగ్‌లో నివాసం ఉంటు న్న గోనా మానస వద్దకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అయిన ఆమె అన్న మనో జ్ బెంగళూరు నుంచి శనివారం వచ్చారు. మాన సచే రాఖీ కట్టించుకున్నారు. ఆమెకు ఆశీర్వాదాలు అందజేసి బహుమతులను ఇచ్చారు. 'మేం అన్ని పండుగల్లో కచ్చితంగా కలుసుకుంటాం. రక్తసంబంధమే అయినా స్నేహితుల మాదిరిగా ఉంటాం. ప్రతీ ఏటా క్రమంతప్పకుండా అన్నకు రాఖీ కడతాను. ఆ క్షణాలు నాకెంతో అనుభూతిని కలిగిస్తాయి. నాన్న తర్వాత అన్న అంతటి ఆప్యాయతను పంచుతాడు' అని మానస అన్నారు.


కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న విప్ జగదీశ్వరి

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

- ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

జియమ్మవలస, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా మండలంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరందించేలా చర్యలు తీసుకుంటు న్నామని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత పాలకులు ప్రాజెక్టులను ఆధునికీకరించలేకపోయారని ఆరోపించారు. ప్రధాన కాలువలు లైనింగ్ నచ్చినట్లు తవ్వడం వల్ల పిల్ల కాలువలకు నీరందని పరిస్థితి ఏర్పడిందని, దీంతో ఆయకట్టకు నీరందక రైతులు ఇబ్బంది పడతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎం.సత్యంనాయుడు, ఎంపీపీ బొంగు సురేష్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డి.రామకృష్ణ, మండల కన్వీనర్ జోగి భుజగరావు, నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్, ఏఈఈ బి.శంకరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ భవన నిర్మాణానికి శ్రీకారం

- పార్వతీపురంలో శంకుస్థాపన

పార్వతీపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం భవనానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరా జు వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తామని కలె క్టర్ తెలిపారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో రెవెన్యూ సంఘ భవనానికి స్థలాన్ని కేటా యించిన ప్రభుత్వానికి బొప్పరాజు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ సంఘం పనిచేస్తోందన్నారు. కార్యక్ర మంలో రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ జనరల్ సెక్రటరీ వెంకట రాజేష్, ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, ఎన్‌జీవో సంఘం నాయకుడు కిషోర్ పాల్గొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్, బొప్పరాజు

రేపటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు


ఎస్‌ఏ పరీక్షలకు సిద్ధమైన ప్రభుత్వ పాఠశాల

గరుగుబిల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పరిధి లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 14 వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది నూతన విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. సెల్ఫ్ అసిస్మెంట్ మోడల్ పేపర్లను అకడమిక్ క్యాలెండర్ మేరకు రూపొందించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సోమవారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం తెలుగు, 12న ఇంగ్లీషు, 13న ఓఎస్ఎస్‌సీ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 10.45 గంటల వరకు, 1.15 గంటల నుంచి 2.30 గంటల వరకు లెక్కలు, ఎన్విరాన్ మెంటల్ సైన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరు 6 నుంచి పదో తరగతి వరకు సోమ వారం నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోమవారం 6, 7, 8 తరగతులకు తెలుగు, లెక్కలు, 12న హిందీ, జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, 13న ఇంగ్లీషు, సోషల్, 14న బయలాజికల్ సైన్స్ ఓఎస్ఎస్‌సీ పరీక్షలను నిబంధనల మేరకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకటి, రెండు, 3, 4, 5, తరగతులకు, 6 నుంచి 9 తరగతులకు సంబంధించి ప్రశ్నపత్రాలు, మార్కులను ఏ విధంగా నిర్వహించాలన్న దానిపై అవసరమైన సూచనలు చేశారు. పదో తరగతికి సంబంధించి పలు సబ్జెక్టుల ప్రశ్నపత్రాలతో కూడిన మోడల్ పేపర్లను, విద్యార్థులకు సంబంధించి ప్రత్యేకంగా బుక్‌లెట్‌లను రూపొందించారు. గత ప్రభుత్వం ప్రశ్నపత్రాలు అందించకుండా సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులతో బోర్డులపై ప్రశ్నలను రాయించే వారు. ప్రస్తుతం విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు నూతన విధానాలను రూపొందించింది.

ఎమ్మార్సీలో ప్రశ్నపత్రాలు..

ఎస్ఏ-1 పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను మండలాల పరిధిలోని ఎమ్మార్సీ భవనంలో ఉంచాలి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు, అలాగే ఆరు నుంచి 10వ తరగతులకు సంబంధించి భద్రపర్చాల్సిఉంది. సంబంధిత ప్రశ్నపత్రాలు ఆయా మండలాల్లోని ఎంఈవో-1, 2లు పర్యవేక్షణలో ఉండాలి. ప్రశ్నపత్రాలను పరీక్ష నిర్వహణకు గంట ముందుగా ఆయా పాఠశాలలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చేరవేయాలి. పరీక్షల నిర్వహణను ఎంఈవోలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పర్యవేక్షించాలి. పరీక్షల నిర్వహణలో అసౌకర్యం నెలకొంటే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి.

పరీక్షల నిర్వహణకు ఆదేశాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహణకు సంబంధించి అవసరమైన ఆదేశాలు అందాయని గరుగుబిల్లి ఎంఈవో వి.వెంకటరావు తెలిపారు. నూతన విధానంలో పరీక్షలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలకు అవగాహన కల్పించామని తెలిపారు. పరీక్షలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రశ్నపత్రాలను ఆయా ఎమ్మార్సీల పరిధిలో భద్రపరిచినట్లు తెలిపారు.

దేవాలయాల్లో ప్లాస్టిక్‌కు చెక్



- ఉత్తర్వులు జారీచేసిన దేవదాయశాఖ కమిషనర్
- సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

రాజాం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో పాలిథిన్ కవర్లు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగానికి దేవదాయశాఖ చెక్ పెట్టింది. ఇకపై ఆలయాల్లో ఇలాంటివి వినియోగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఫలితంగా ప్లాస్టిక్ కవర్లలో లడ్డూలు, పులిహోర, దద్దోనం, పొంగలి వంటి ప్రసాదాలు.. పాలిథిన్ కవర్లలో కొబ్బరికాయలు, అరటిపల్లు, ఊదిబత్తి, తదితర పూజాసామగ్రి వినియోగించేందుకు బ్రేక్ పడనుంది. వీటి వినియోగాన్ని నిషేధించాలని దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. వీటి అమలుకు అసిస్టెంట్ కమిషనర్లు దశలవారీగా కృషి చేయాలని సూచించారు. దేవదాయశాఖ కార్య నిర్వాహణ అధికారులు, ఉద్యోగులు, ఆలయాలలో అర్చకులు, భక్తులు దేవదాయశాఖ ఉత్తర్వులను అమలు చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో ఆలయ ప్రాంగణాల్లో ఏ తరహా వస్తువులు వినియోగించాలో దేవదాయశాఖ కమిషనర్ ప్రకటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర విజన్ 2047లో భాగంగా దేవదాయశాఖ కమిషనర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాలెన్నో..

జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకమైన, అతి పురాతనమైన, జిల్లావాసులు ఆదరిస్తున్న ఎన్నో దేవాలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని దేవదాయ శాఖ పరిధిలో ఉండగా మరికొన్ని శాఖ పరిధిలోనికి రాకుండా ప్రాచుర్యం పొందిన ఆలయాలు ఉన్నాయి. ప్రధానంగా విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి దేవస్థానంతో పాటు వేంకటేశ్వరస్వామి దేవస్థానం, రామతీర్థంలోని రామస్వామి దేవస్థానం, రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం, నవదుర్గ అమ్మవారి దేవస్థానం, టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలాజీ దేవస్థానం, బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయం, దాడితల్లి అమ్మవారి ఆలయం, ఎస్.కోట మండల పరిధిలోని పుణ్యగిరిలో శివాలయం, చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, పూసపాటిరేగ మండలంలో ప్రఖ్యాతమైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం.. ఇలా నిత్యం భక్తులతో కిటకిటలాడే దేవాలయాలు ఉన్నాయి. అయితే ఆయా ఆలయాల్లో ప్రత్యామ్నాయం లేక ప్రస్తుతం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. అలాగే 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లూ వినియోగంలో ఉన్నాయి. కొన్ని ఆలయాల్లో ప్లాస్టిక్ కవర్లలో లడ్డు, పులిహోర ప్రసాదాలను విక్రయిస్తున్నారు. ఇకపై ఆలయాలలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని దేవదాయశాఖ నిర్ణయించింది.


రాజాంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానం

ఇవీ నిబంధనలు..

● 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లు వాడకూడదు. వాటి స్థానంలో కాటన్, జ్యూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు వాడాలి. ● సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, బౌల్స్ స్పూన్ల స్థానంలో ఆకులతో చేసిన వస్తువులు వాడాల్సి ఉంటుంది. ● థర్మాకోల్ కప్పులు, ప్లాస్టిక్ స్ట్రాలు, జెండాలు, బ్యానర్లు కూడా వినియోగించకూడదు. ● ఆలయాల వద్ద ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నట్లు బోర్డులు ఏర్పాటు చేయాలి. మైక్‌లో ప్రకటించాలి. ● ఆలయాల ప్రాంగణంలో ఉండే వ్యాపారులెవ్వరూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు అమ్మకుండా నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలి. ● అన్న ప్రసాదాలను అరిటాకులలో సరఫరా చేయాలి. ● ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల వినియోగాన్ని తగ్గించేందుకు వీలుగా ఆలయాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలి.

సీఎంఆర్‌ఎఫ్‌ పంపిణీ

గుర్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో గుర్ల మండలానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు శనివారం పంపిణీ చేశారు. మండలంలోని జమ్ముపేటకు చెందిన ఎంతవ నారాయణరావుకు రూ.2లక్షలు, యాగాటి వెంకట రామకృష్ణకు రూ.లక్షా 5వేల 317 చెక్కులను అందజేశారు. రాష్ట్ర బీసీ సెల్‌ కార్యదర్శి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వరరావు, చీపురుపల్లి బీసీ సెల్‌ కార్యదర్శి డి.శివప్రసాద్‌, కె.గోవిందు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

మెరకముడిదాం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం గ్రామంలో గల తాడేలవీధిలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, బైరిపురం ఏఎంసీ చైర్మన్‌ తాడ్డి చంద్రశేఖర్‌, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సే ఉపాధ్యాయుల బాధ్యత



మాట్లాడుతున్న డీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

విజయనగరం టౌన్‌, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సులో ఉపాధ్యాయుల బాధ్యత కూడా ఉందని డెమొక్రటిక్‌ (డీపీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ డి.శ్రీను అన్నారు. విజయనగరం యూత్‌ హాస్టల్‌ సమీపంలో గల ఏపీజీఈఏ సంఘ భవనంలో డీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా తమ బాధ్యతగా సమాజం ఉన్నత స్థితిలోకి రావడానికి శ్రమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంది వెంకటరమణ, కృష్ణా జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్‌, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు దామోదరరావు, మన్యం జిల్లా అధ్యక్షుడు ఇ.శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడు నారాయణప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూల్‌ డ్రింక్స్‌ను త్యజిద్దాం

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హాని కలిగించే కూల్‌ డ్రింక్స్‌ను విడిచిపెడదామని జన విజ్ఞాన వేదిక జాతీయ విద్యా కమిటీ కన్వీనర్‌ డాక్టర్‌ ఏవీ రాజశేఖర్‌ అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌ గురజాడ పాఠశాలలో శనివారం నిర్వహించిన 'క్విట్‌ కూల్‌ డ్రింక్స్‌' కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కూల్‌డ్రింక్స్‌లో కార్బన్‌ డయాక్సైడ్‌, ఆల్కాహాల్‌, ఎరువులు తదితర ప్రమాదకరమైన పదార్థాలు కలుపుతారని, ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో హానికలిగిస్తాయని చెప్పారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్‌ మాట్లాడుతూ విదేశీ కూల్‌డ్రింక్స్‌ను విడిచిపెట్టి.. మన ఆరోగ్యాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, గురజాడ పాఠశాల హెచ్‌ఎం పూడి శేఖర్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

దత్తిరాజేరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్‌ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పెదమానాపురం ఎస్‌ఐ ఆర్‌.జయంతి అన్నారు. శనివారం పెదమానాపురం సంతలో సైబర్‌ నేరాలు, రోడ్డు భద్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు బ్యాంకు ఓటీపీలు చెప్పరాదన్నారు. అలాగే మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎస్‌.కోట పుణ్యగిరి రోడ్డులోని గిరిజన కళాశాల బాలికల వసతిగృహానికి సీసీరోడ్డు, ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం భూమి పూజ చేసారు. ఎంపిపి నండి సోమేశ్వరరావు, వైఎస్‌ఎంపిపి ఇందుకూరి సుధారాణి, ఎంపిటీసీలు దారగిరి, మజ్జి దేవి తదితరులు వున్నారు.

నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కొత్తవలస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ రోజున 1 నుంచి 19 సంవత్సరాలు లోపు పిల్లలతో నులిపురుగుల నివారణా మాత్రలను మింగిస్తామని చెప్పారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా నిలవండి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రక్షా బంధన్‌
- రాఖీలు కట్టిన విద్యార్థినులు

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలకు అండగా నిలవాలని విద్యార్థినులు కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాలికల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్ద రక్షా బంధన్‌ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాలికల కమిటీ కన్వీనర్‌ సమీరా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోదర భావాన్ని పెంపొందించుకునేలా ఆడబిడ్డలకు అండగా నిలవాలనే దృక్పథంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ



విద్యార్థులకు రాఖీలు కడుతున్న ఓంశాంతి ఇన్‌చార్జి లతక్క



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాలుడికి రాఖీ కడుతున్న విద్యార్థినులు



శృంగవరపుకోట: సీఐ నారాయణమూర్తికి రాఖీ కట్టిన విద్యార్థినులు

కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జె.రవికుమార్‌, సి.రమేష్‌, సహాయ కార్యదర్శి కె.రాజు, నాయకులు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ సందర్భంగా శనివారం ఎస్‌.కోట పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్‌ చేశారు. సీఐ నారాయణ మూర్తి, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లకు రాఖీలు కట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

గరివిడిలో..

గరివిడి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలో గల ఉమెన్‌ అండ్‌ చైల్డ్‌ వెల్ఫేర్‌ సెంటర్‌లో శనివారం రక్షాబంధ్‌ కార్యక్రమం నిర్వహించారు. గరివిడి ఓం శాంతి ఇన్‌చార్జి లతక్క తన బృందంతోపాటు పాఠశాలకు వచ్చి, విద్యార్థులకు రాఖీలు కట్టారు.

వారికి తెలియకుండా ఎలా కలిపేశారు

ఎస్‌.కోట రూరల్‌, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలో ఉన్న దెప్పూరు గిరిజన గ్రామాన్ని అక్కడ నివాసం ఉంటున్న 13 గిరిజన కుటుంబాలకు తెలియకుండా జిందాల్‌కు ఎలా కేటాయించారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విస్మయం వ్యక్తంచేశారు. శనివారం బొడ్డవర గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వే నెంబర్‌ 146-4లో దెప్పూరు అనే గ్రామం ఉందని, ఇక్కడ కొద్దికాలం కిందట గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఇవ్వడంతో వారు ఇళ్లు కూడా కట్టుకున్నారన్నారు. అయితే కొద్దిరోజుల కిందట ఈ గ్రామాన్ని జిందాల్‌కు రిజిస్ట్రేషన్‌ చేశామని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు దర్యాప్తు చేపట్టాలని ఆయన కోరారు. జిందాల్‌ భూముల సేకరణపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ నిర్వహించాలన్నారు.

సునీతకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యో తి): వైఎస్‌ సునీతరెడ్డికి న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒక ఆడపిల్ల... ఆధారాలతో ఎవరు తమ తండ్రిని హత్య చేశారో, దానికి ఎవరు సహకరించారో.. ఎవరు తమ కుటుంబాన్ని ఎలా తప్పుదోవ పట్టించారో వివరాలతో సహా ప్రాణాలకు తెగించి బయట పెడుతున్నా.. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు న్యాయం చేయడం లేదన్నారు. ఈ జాప్యంతో ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సునీత రెడ్డికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పదవికి న్యాయం చేస్తా

కొత్తవలస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని కొత్తవలస పీఏసీఎస్‌ అధ్యక్షుడు కోళ్ల వెంకట రమణ(శ్రీను) అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి ముఖ్యకారకులైన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర నాయకుడు కేబీఏ రాంప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రైతులకు అండగా చంద్రబాబు

- రాజాం ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుంటారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకంతో పాటు పీఎం కిసాన్‌ నిధులతో రైతుల ఖాతాల్లో రూ.7వేలు చొప్పున జమ చేశారన్నారు. నియోజకవర్గంలో సుమారు 30వేల మంది రైతులకు సుమారు రూ.28 కోట్లు వారి ఖాతాలకు జమ చేశారని తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని సుమారు 28వేల ఎకరాలకు తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం ప్రాజెక్టులు ద్వారా సాగునీరు అందించాలన్నదే లక్ష్యంగా చేసుకున్నామన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా 9951095888 నెంబరుకు తెలియజేయాలని సూచించారు. మున్సిపాలటీలో, గ్రామాలలో తాగునీరు, విద్యుత్‌, కాలువలు, రోడ్లు తదితర సమస్యలు ఉంటే వాట్సాప్‌లో తెలియజేయాలన్నారు.

14న 150 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

నియోజకవర్గ స్థాయిలో రైతులతో ఈనెల 14న రాజాం పట్టణంలో 150 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఉత్తమ రైతులకు సత్కారాలు ఉంటాయన్నారు.

తోటపల్లి రాజాం బ్రాంచ్‌ కాలువకు మోక్షం



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తోటపల్లి రాజాం బ్రాంచ్‌ కాలువ(16ఎల్‌) రైతులకు ఎట్టకేలకు ఊరట లభించింది. ఈ కాలువ పరిధిలోని ఏడు గ్రామాల రైతులు ఇటీవల ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావుకు తమ సమస్యలను విన్నవించారు. ఆయన ఆదేశాలతో సుమారు రూ.10లక్షల అంచనాతో వ్యయంతో మరమ్మతులకు చర్యలు మొదలయ్యాయి. ఈ మేరకు శనివారం ఈ కాలువను తోటపల్లి రాజాం బ్రాంచ్‌ డీఈఈ హరికృష్ణంనాయుడు, ఏఈ కె.రఘులు చిన్నశిర్లాం వద్ద పరిశీలించారు. రెండు కిలోమీటర్ల మేర కాలువ పూడికలు, అవసరమైన మరమ్మతులకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇంకా చిన్నశిర్లాం వద్ద రైతుల సౌకర్యార్థం వంతెన ఏర్పాటుకు, ఇక్కడ పైప్‌లైన్‌ తొలగింపునకు మరో రూ.40లక్షల అవసరం ఉందని, దీనిపై అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు. ఈ పరిశీలనలో టీడీపీ నాయకులు పాలవలస రామచంద్రినాయుడు, మజ్జి శ్రీనివాసరావు, గురవాన ధనంజయ్‌రావు, ఎం.దాలినాయుడు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

రాజాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు మండల నాయకులు, అధికారులతో సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ నర్సు రామారావు ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వభ్య సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. సమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఏవో చీకటి రఘునాథ్‌ మాట్లాడుతూ మండలానికి అవసరమైన ఎరువు వచ్చినప్పటికీ రైతులకు పూర్తి స్థాయిలో అందించడానికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. వైస్‌ ఎంపీపీ నక్క పద్మ మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదన్నారు. తోటపల్లి ఇంజనీరింగ్‌ అధికారులు, స్థానిక ఇరిగేషన్‌ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో సభ్యులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమంపై దృష్టి సారించాలి

శృంగవరపుకోట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంక్షేమంపై పాలకులు దృష్టి సారించాలని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ్‌భాస్కర్‌ కోరారు. శనివారం ఎస్‌.కోట గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో అంబేడ్కర్‌ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు మౌలానా, బీజేపీ నాయకుడు రామకోటి, పి.సూరిదేముడు, గుర్రపు శ్రీను, డోల కేశవ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయకుండా సంబరాలు ఎందుకు?

- 50వ రోజుకు చేరిన జిందాల్‌ నిర్వాసితుల నిరసన



ఆకులతో నిరసన చేస్తున్న జిందాల్‌ నిర్వాసితులు

ఎస్‌.కోట రూరల్‌, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీల్లో ఉన్న ఆదివాసీలు జిందాల్‌ పరిశ్రమకు భూములు ఇచ్చి మోసపోయారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయకుండా ఆదివాసీ ఉత్సవాలు చేయడం చాలా దారుణమని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్‌ అన్నారు. బొడ్డవర గ్రామంలో జిందాల్‌ నిర్వాసితులు గత 50 రోజులుగా శాంతియుత నిరసన చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆకులు, కొమ్మలు కట్టుకుని నిరసన తెలిపారు.

కూలిన వాటర్‌ ట్యాంకు దిమ్మ

- పనుల్లో నాణ్యతా లోపమే కారణం అంటున్న కడకొండ గిరిజనులు

వేపాడ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వావిలపాడు శివారు కడకొండ గిరిజన గ్రామంలో జలజీవన్‌ మిషన్‌ పథకంలో భాగంగా వ్యాటర్‌ ట్యాంకు గాను నిర్మించిన దిమ్మ ఇటీవల కూలిపోయింది. ఇంటింటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ నిర్మాణం.. లక్ష్యం నెరవేరకుండానే కూలిపోయింది. ఈ దిమ్మ నిర్మాణంలో జాప్యం కావడంతో తాగునీరు సరఫరా చేయడానికి వీలు కాలేదు. ఇంతలోనే ఇటీవల కురిసిన వర్షాలకు కిందకు జారిపోయి పక్కనే ఉన్న కోనేరులో పడిపోయింది. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం కారణంగా ఇలా జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గుత్తేదారు నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని కోరుతున్నారు.

● ఈ విషయమై గుత్తేదారు సతీష్‌ వద్ద ప్రస్తావించగా.. కడకొండ గ్రామానికి జలజీవన్‌ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయగా టెండర్‌లో పనిని సొంతం చేసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 5వేల లీటర్ల ట్యాంకుతో పాటు పైపులైన్లు ఏర్పాటు చేసి, ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు సిమెంటు ఇటుకులతో దిమ్మను నిర్మించామని చెప్పారు. అయితే ఆ దిమ్మపై వాటర్‌ ట్యాంకును ఏర్పాటు చేయలేదన్నారు. వర్షాలకు భూమి పదును ఎక్కి మట్టి లాగేయడం వల్ల దిమ్మకూలిపోయి ఉంటుందన్నారు. మళ్లీ నిర్మించి, ట్యాంకు ఏర్పాటు చేసి నీరు అందిస్తామని చెప్పారు.

● ఇదే విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ దేవిని వివరణ కోరగా.. దిమ్మ కూలిపోయిన విషయమై పరిశీలించి, తగు చర్యలు చేపడతామన్నారు.



దిమ్మ కూలిపోయిన దృశ్యం

రెండేళ్లు అవుతున్నా పాత పేర్లే..

- మారని రాజాం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలకవర్గం బోర్డు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

రాజాం రూరల్‌, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెటింగ్‌ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి మచ్చుతునక ఈ చిత్రం. రాజాం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలకవర్గ కాలపరిమితి ముగిసిపోయి రెండేళ్లు గడిచింది. గత ఏడాది మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. జూన్‌లో వెలువడిన ఫలితాలలో రాజాం ఎమ్మెల్యేగా కోండ్రు మురళీమోహన్‌ ఎన్నికయ్యారు. అయినాసరే యార్డులోని బోర్డులో మాత్రం పాత పాలకవర్గాన్నే కొనసాగిస్తున్నారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన బోర్డుపై గౌరవాధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌గా పాలవలస పద్మావతి పేరుతో పాటు కాలపరిమితి ముగిసిన సభ్యుల పేర్లు ఉన్నాయి. యార్డుకు వచ్చిన వారంతా బోర్డుపై ఉన్న పేర్లను చూసి అధికారుల నిర్లక్ష్యాన్ని గుర్తుచేస్తున్నారు.



గత పాలకవర్గం పేర్లు దర్శమిస్తున్న బోర్డు

ఎన్నాళ్లీ ఇన్‌చార్జి పాలన?

- మెరకముడిదాం మండలానికి పూర్తి స్థాయిలో లేని ఉపాధి ఏపీవో

మెరకముడిదాం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలానికి గత మూడేళ్ల నుంచి ఉపాధి హామీ ఏపీవో పూర్తిస్థాయిలో లేనందున ఇన్‌చార్జిలతోనే పాలన కొనసాగుతోంది. గతంలో ఇక్కడ ఏపీవోగా పనిచేసిన పెద్దప్పలనాయుడు వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ఉపాధి పనుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే సాగుతోంది. ఇటీవల ఉపాధి కార్యాలయంలో పనిచేస్తున్న ఈసీకి ఇన్‌చార్జి ఏపీవోగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయనను విధులు నుంచి తొలగించి దత్తిరాజేరు మండలానికి చెందిన ఏపీవో కామేశ్వరరావును ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటికైనా మెరకముడిదాం మండలానికి పూర్తిస్థాయిలో ఏపీవోను నియమించాలని పలువురు కోరుతున్నారు.

కాలువలో పడి సాలూరు వాసి మృతి

పాచిపెంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దగెడ్డ జలాశయం కాలువలో పడి సాలూరు గొడగలవీధికి చెందిన ముంజేటి నాగేంద్రబాబు మృతి చెందాడు. పోలీసులు,స్థానికుల కథనం మేరకు.. సాలూరుకు చెందిన ముంజేటి నాగేంద్రబాబు చుట్టు పక్కల గ్రామాల్లో ఖాళీ ప్లాస్టిక్‌ బాటిళ్లు, ప్లాస్టిక్‌ వేస్ట్‌ మెటీరియల్‌ ఏరుకుని జీవిస్తున్నాడు. నాగేంద్రబాబు తన భార్య కరిస్మాతో బాటిళ్లు ఏరడానికి వెళ్తానని ఈనెల ఏడో తేదీన చెప్పాడు. భర్త తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు.ఇంతలో శుక్రవారం సాయంత్రం పెద్దగెడ్డ జలాశయం కాలువలో పడి మృతి చెందడాన్ని గుర్తించారు. వెంటనే భార్య కరిస్మాకు సమాచారం చేరవేయడంతో వెంటనే పాచిపెంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హెచ్‌సీ కృపారావు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సాలూరు పీహెచ్‌సీకి తరలించారు.

తిరుమలలో విజయనగరం జిల్లావాసి అదృశ్యం

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన విజయనగరం జిల్లావాసి కనిపించడం లేదంటూ శనివారం తిరుమల టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయనగరం జిల్లా, కన్నితిమ్మాపురానికి చెందిన సురేష్‌(37) గత నెల 19వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. అదేరోజు తిరుమలలోని యాత్రిసదన్‌ వద్ద కనిపించకుండాపోయాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతని కోసం తిరుమల, తిరుపతి, సొంత ఊర్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం తిరుమల టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేష్‌ వివరాలు తెలిసిన వారు 9440796772 కు తెలియజేయాలని కోరారు.

గడువు ముగిసిన ఓఆర్‌ఎస్‌ తాగి మహిళ అస్వస్థత

- ఫుడ్‌ సేఫ్టీ అధికారుల తనిఖీ.. కేసు నమోదు

విజయనగరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత బస్‌స్టాండ్‌ వద్దగల సంతోష్‌ హోల్‌సేల్‌ దుకాణంలో గడువు ముగిసిన ఓఆర్‌ఎస్‌ తాగిన రాణి అనే మహిళ తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. రాణి.. ఈనెల 7వ తేదీన 28 ప్యాకెట్స్‌ కలిగిన ఓఆర్‌ఎస్‌ డ్రింక్స్‌ బాక్సును బల్క్‌లో కొనుగోలు చేసి ఇంటికి తీసుకు వెళ్లింది. అందులో ఒకటి తాగిన తర్వాత తీవ్రమైన కడుపునొప్పి వాంతులు కావటంతో ఆసుపత్రిలో చేరింది. వైద్యులు చికిత్స చేసి ఇంటికి పంపించారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి ప్యాకెట్లను పరిశీలించగా.. దానిపై గడువు తేదీ ముగిసినట్టు ఉంది. వెంటనే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఫుడ్‌సేఫ్టీ అధికారి నాగుల్‌మీరా శనివారం ఆ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గడువు ముగిసిన ఓఆర్‌ఎస్‌ డ్రింక్‌ ప్యాకెట్లు లభించాయి. ఆ డ్రింక్‌ శాంపిల్స్‌ సేకరించి దుకాణం యజమానిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ ప్రజలు ఆహార ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పుడు గడువు తేదీని తప్పనిసరిగా పరిశీలించాలని కోరారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే 87906 03489 నెంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మూడు టన్నుల పశుమాంసం సీజ్‌

బొండపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలీసు స్టేషన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై మూడు టన్నుల పశుమాంసాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు పట్టుకుని, సీజ్‌ చేశారు. స్థానిక ఎస్‌ఐ యు.మహేష్‌ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు నుంచి రాజమండ్రికి అక్రమంగా వ్యానులో 3 టన్నుల పశుమాంసాన్ని తరలిస్తున్నట్టు ముందుగా పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి దాడిచేసి, ఆ వ్యాన్‌ను పట్టుకున్నారు. అందులో మాంసాన్ని గుర్తించారు. ఈ మాంసాన్ని బొండపల్లి పశువైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్‌ పరీక్షించి పశుమాంసంగా నిర్ధారించారు. దీంతో వాహనాన్ని పోలీసుల పర్యవేక్షణలో ఉంచారు. ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

లక్కవరపుకోట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ నవీన్‌ పడాల్‌ తెలిపారు. ఆయన శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరాంపురం గ్రామానికి చెందిన వనము వంశీ కృష్ణ, ఇస్మాయిల్‌, సోమేష్‌లు శుక్రవారం కల్లేపల్లి గ్రామంలో తమ ద్విచక్రవాహనానికి పెట్రోలు కొట్టిస్తున్నారు. అదే సమయంలో అక్కడ ఉన్న కల్లేపల్లి గ్రామానికి చెందిన కడియాల హేమంత్‌, కడియాల తేజలు వీరితో వివాదానికి దిగారు. 'మీరు ఎవరు.. మీ చూపు ఏంటి అలా ఉంది' అంటూ కయ్యానికి కాలు దువ్వారు. వారి ముగ్గురిపై దాడికి దిగారు. ఈ దాడిలో హేమంత్‌.. వంశీకృష్ణను కర్రతో బలంగా కొట్టడంతో తలకు తీవ్రమైన గాయం అయింది. క్షతగాత్రుడిని ఎస్‌.కోట పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. అందిన ఫిర్యాదు మేరకు హేమంత్‌, తేజలపై పోలీసులు కేసు నమోదుచేశారు.

నాటు తుపాకులు కలిగి ఉండడం నేరం

ఎస్‌.కోట రూరల్‌, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎవ్వరైనా అనుమతులు లేకుండా నాటు తుపాకులు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని, కఠిన శిక్షలు ఉంటాయని ఎస్‌.కోట సీఐ నారాయణమూర్తి హెచ్చరించారు. శనివారం పోతనాపల్లి పంచాయతీ ఎరుకులపేటలో ఆయన ఆధ్వర్యంలో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. అనంతరం స్థానికులకు అవగాహన కల్పించారు. ● వేపాడ: ఎవరి వద్ద అయినా ప్రభుత్వ అనుమ తులు లేని నాటు తుపాకులు ఉంటే వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని ఎస్‌.కోట రూరల్‌ సీఐ అప్పలనాయుడు గిరిజన ప్రజలకు సూచించారు. ఈ మేరకు కొండగంగుబూడి పంచాయతీ శివారు సొంటివానిపాలెం, చిట్టువాని పాలెం గ్రామాల్లో శనివారం కార్డర్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఎస్‌ఐ సుదర్శన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

వరుస దొంగతనాలు

సంతకవిటి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండల కేంద్రంలోని ఓ ఆటోకి ఉన్న బ్యాటరీని, మరికొన్ని స్పేర్‌పార్టులను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఆగస్టు 2న మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లి, అందులోని నగదును కాజేశారు. గత జూలై 5న ఓ వైన్స్‌ షాపులో దుండగులు చొరబడి నగదును చోరీ చేశారు. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేవు.. పర్యవేక్షణ లేదు




వీరఘట్టం: రేగులపాడు రహదారిలో మలుపు

జిల్లాలో పలు రహదారులపై మలుపుల్లో తరచూ ప్రమదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతోపాటు ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణకు నోచుకోని పరిస్థితి నెలకొంది. మలుపులకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలుతొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాల్సిన అధికారులు చోద్యంచూస్తున్నారు.

గరుగుబిల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సుంకి ప్రధానరహదారి మార్గంలో పాలకొండ, శ్రీకాకుళం,కురుపాం,జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురంమండలాలతో పాటు అంతర్రాష్ట్ర సర్వీసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడి మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు వా హనాలు అదుపు తప్పి చెట్లను ఢీకొంటున్నాయి. ●తోటపల్లి పాతబ్యారేజీప్రాంతంలో మలుపు ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడ ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. పాత బ్యారేజీకి సంబంధించి బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ప్రధాన కల్వర్టుకు గతంలో ఏర్పాటు చేసినరక్షణగోడలు పాడయ్యాయి. ఇక్కడ వాహనాలు మలుపులో తిరుగు తున్న సమయంలో రక్షణ గోడలను ఢీకొంటున్నాయి. ● గిజబ, నందివానివలసతో పాటు పలుగ్రామాల్లో మలుపుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

●వీరఘట్టం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకొండ-వీరఘట్టం ప్రధానరహదారి పాపంపేట, రేగులపాడు వద్ద మలుపులు ప్రమాదకరంగా మారాయి. రద్దీగాఉండే ఈమార్గంలో మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

●హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు నోచుకోని వైనం ●ఇదీ మలుపుల్లో పరిస్థితి



గరుగుబిల్లి: సుంకి ప్రాంత మలుపులో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

ఐటీడీఏ పీవోలను కొనసాగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలను సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులుగా కొనసాగించాలని గిరిజన సంఘాలు కోరాయి. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో పలు గిరిజన సంఘాల నాయకులు కోరారు. అనంతరం ఇరువురు పీవోలను కొనసాగించాలని ర్యాలీ నిర్వహించారు.

వెంకన్నకు వెండి సామగ్రి బహూకరణ



వెండి వస్తువులు అందజేస్తున్న సీఐ తిరుపతిరావు

గరుగుబిల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామికి కేజీ వెండితో తయారు చేసిన సామగ్రిని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.తిరుపతిరావు చేతులమీదుగా దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులుకు అందించారు. సౌదీ అరేబియా నివాసి ఓలేటి గౌరునాయుడు, ధాత్రీ దంపతులు స్వామివారి కోసం కేజీ బరువు ఉన్న వెండిశరగోపం, వెండి పళ్లెం, గ్లాసు, హారతి దీపం, తదితర వస్తువులను బహూకరించారు. ఓలేటి గౌరునాయుడు, ధాత్రీ దంపతులు రూ. 1.50 లక్షల విలువైన వెండి ఆది తల్లి విగ్రహాన్ని అందించినట్లు జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డి.పారినాయుడు తెలిపారు. కార్యక్రమాల్లో అన్నదాన సత్రం ఛైర్మన్ మోనంగి ప్రకాష్ మార్కొండ పకీరునాయుడు, మరడాన సింహాచలం, ఎం.మురళీనాయుడు, ఆర్ఐ వాసుదేవరావు, సత్యం మాష్టారు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

బెలగాం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వాహనాలతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని 104 వాహనాల జిల్లా మేనేజర్ కృష్ణ, ఫ్లీట్ మేనేజర్ పైడిరాజు తెలిపారు. శనివారం పార్వతీపురంలోని ఎన్జీవో హోంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే 104వాహనాల డ్రైవర్లకుశిక్షణతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను పరిశీలించి రిపేర్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. త్వరలో అన్ని రకాల పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులోకి తీసుకువస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు మురళి, రాజశేఖర్ పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

● గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమల ప్రసాద్



మాట్లాడుతున్న తిరుమల ప్రసాద్

గరుగుబిల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):మాతా శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికల హెచ్చు తగ్గులు గుర్తించిగర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్ఎంకే తిరుమల ప్రసాద్ తెలిపారు.శనివారం పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సుకు వైద్య సిబ్బంది అంకిత భావంతో సేవలందించాలని, గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా ఉండేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. గ్రామాల నుంచి తనిఖీలు నిమిత్తం వచ్చిన గర్భిణులకు రక్తపరీక్షలు చేయడంతోపాటు పిజం 10 గురించి అవగాహన కల్పించి గర్భిణులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎస్.జగదీశ్వరి, హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీనివసారావు, అంగన్‌వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి పాల్గొన్నారు.

డీవార్మింగ్ డే కార్యక్రమానికి ఏర్పాట్లు

గరుగుబిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 12న నిర్వహించనున్న డీవార్మింగ్ డే కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని వైద్యుడు ఎన్ఎంకే తిరుమల ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిల్లల్లోనులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించనున్నట్లు తెలిపారు. జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుచర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల వరకు పిల్లలు, విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు,కళాశాలల్లో ఆల్బెండజోల్‌మాత్రలు వేస్తామని తెలిపారు. పిల్లల్లో నులి పురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వాంతులు, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం సమస్యలు ప్రబలుతున్నాయని చెప్పారు.

ఆడలి వ్యూపాయింట్‌లో తప్పిన ప్రమాదం

సీతంపేట రూరల్,ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):సీతంపేట మన్యంలోని ఆడలి వ్యూపాయింట్‌లో పెను ప్రమాదం తప్పింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆడలి వ్యూపాయింట్‌లో క్యాంటీన్‌కు సమీపంలో ఉన్న రక్షణగోడ నేలకూలింది. అయితే ఆ సమయంలో క్యాంటీన్‌లో ముగ్గురు నిద్రిస్తున్నారు. ఒక్కసారిగా శబ్దం రావడంతో వారు అప్రమత్తమయ్యారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పడంతో నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

భామిని, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బత్తిలిలో సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ఊరేగించారు. శనివారం అమ్మవారుకు మేళతాళాలతో పురవీధుల్లో ప్రదర్శన చేశారు. ఆలయ అర్చకులు తాతబాబుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

●సాలూరు రూరల్,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):సాలూరు సంతోషి మాత ఆలయంలో ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.



సాలూరురూరల్: ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

సామూహిక వంటశాలల ప్రతిపాదన రద్దు చేయాలి

● ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సంఘం డిమాండ్



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

సాలూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన పథకంలో సామూహిక వంటశాలల ద్వారా భోజన పథకాన్ని నిర్వహించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలను వెంటనే రద్దు చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం, సీఐటీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం సాలూరులో ప్రభుత్వం ప్రతిపాదనలు వెంటనే విరమించాలని డిమాండ్‌చేస్తూ భోజనపథకం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ బలోపేతానికి దోహదమయ్యిందని తెలిపారు. విద్యార్థుల్లో రక్తహీనతలు తగ్గిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచాలని, వంటనిర్వాహకులకు జీతాలు పెంచాలని ఒక పక్క కార్మికులు ఆందోళన చేస్తుంటే, వారిసమస్యలు పరిష్కరించని ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు వంటలను అప్పగించాలనిచూస్తే పోరాటానికి వెనుకడుగువేయబోమని హెచ్చరించారు. ఈనెల పదోతేదీన భోజన నిర్వాహకుల సంఘం మహాసభలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో భోజననిర్వాహకుల సంఘ నాయకులు సీహెచ్ సుశీల, బి.సింహాచలం, కె.లక్ష్మి, కె.సీతమ్మ, సీతమ్మ, ఎస్.నబాన, పి. శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి



సమావేశంలో సత్యనారాయణమూర్తి

పాలకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీ వ్ర అన్యాయానికి గురవుతున్నారని, వారి తరఫున తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం పాలకొండలో రెండో రోజు జరిగిన సీపీఐ జిల్లా మహాసభల్లో మాట్లాడారు. సుపరిపాలన పేరుతో మోదీ, చంద్రబాబు ప్రజలను దగా చేస్తున్నారని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. అమెరికాకు అనుకూలంగా మోదీ నడుచుకుంటున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీలు పెంపు,నిత్యావసర ధరలు పెరుగుదల పెనుభారంగా మారాయన్నారు. విలువైన ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకు కారుచౌకగా ఇచ్చారని, ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. తల్లికివందనం పథకం 50 శాతం మందికి పథకం వర్తించలేదన్నారు. ఉత్తరాం ధ్ర వలస ప్రాంతంగా తయారైందన్నారు. ఉత్తరాంధ్రాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్‌చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధి, హక్కులు కోసం ఐక్య పోరాటాలు అవశ్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, కూరంగి మన్మథరావు, ఉత్తరావల్లి మురళీమోహన్, భారతి, ద్వారపూడి అప్పలనాయుడు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్న గిరిజన నాయకులు



మక్కువరూరల్: ఆదివాసీల వేషధారణలో ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

ఆదివాసీల హక్కులను రక్షించాలి

ఆదివాసీల హక్కులు,సంస్కృతిని రక్షించాలని గిరిజనసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లావ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన, ప్రజాసంఘాలు, జేఏసీ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు ప్రతి గిరిజనుడు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఇంతవరకు షెడ్యూల్డ్ ఏరియాలో లేని గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా ప్రగటించాలని, పీసా చట్టం పటిష్టంగా అమలు చేయాలని, ఏజెన్సీలో గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

● గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడిఉందని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం యూత్‌ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో గిరిజన సం ఘాలు భద్రగిరి నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు మేళతాళాలతో థింసా నృత్యాలతో ర్యాలీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, తహశీల్దార్ శేఖర్, లక్ష్మణరావు, ఎల్విన్‌పేట ఎస్ఐ శివ ప్రసాద్ పాల్గొన్నారు.

●మక్కువ రూరల్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో ప్రిన్సిపాల్ కుప్పిలి సురేష్‌ఆధ్వర్యంలో ఆదివాసీదినోత్సవం నిర్వహిం చారు. విద్యార్థుల ఆదివాసీల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆదివాసీ సంబరం

(5వ పేజీ తరువాయి)

మనస్తత్వం ఉన్నా.. ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు ఆదివాసీల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జీవో నెంబర్-3పై గతంలో జరిగిన సమావేశానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను ప్రభుత్వానికి పంపించామన్నారు. గత సంవత్సరంలో టెన్త్‌లో 91 శాతం, ఇంటర్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించిన ఆదివాసీ విద్యార్థులను అభినందించారు. డీఏ జుగా పథకంలో భాగంగా ఆరు ఆశ్రమ పాఠశాలలకు కిచెన్, బిల్డింగ్‌లు మంజూరయ్యాయని తెలిపారు. అంబులెన్స్‌లు ఏడు ఉన్నాయని, మరో ఐదు మంజూరు చేసినట్లు వెల్లడించారు. 24 ఫీడర్ అంబులెన్స్‌లు ఉన్నాయని, నాలుగు బర్త్ వెయిటింగ్ మంజూరైట్లు చెప్పారు. 17 గిరిజన పాఠశాలల భవన నిర్మాణాల్లో నాలుగు పూర్త య్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అనంతరం లబ్ధిదా రులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో ట్రైకార్ బోర్డు డైరెక్టర్ లావణ్య, ఐటీడీఏ ఏపీవో పి.మురళీధర్, డీడీ ఆర్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఈ మూడు దేవాలయాలను 6ఏలో పొందుపర్చారు. ఈ దేవాలయాలకు ధర్మకర్తల మండలి చైర్మన్‌తో పాటు మరో 8 మంది పాలక మండలి సభ్యులను నియమించనున్నారు. ఇందులో ప్రధాన అర్చకులతో పాటు ఆలయ వ్యవస్థాపకుల్లో ఒకరిని నియమించనున్నారు. శాసనసభ్యులు ఆమోదంతో ఎంపిక చేయనున్నారు. 'జిల్లాకు సంబంధించి మూడు ప్రధాన ఆలయాల్లో ధర్మకర్తల మండలి నియామకాలపై ఆదేశాలు అందాయి. సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో నోటిఫికేషన్ల ప్రతులను ఉంచుతాం. నిబంధనల మేరకు అర్హుల ఎంపిక జరగనుంది. దరఖాస్తుల స్వీకరణ తర్వాత సంబంధిత వ్యక్తుల సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తాం.' అని ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు.

1నుంచి కొత్త బార్లు

(5వ పేజీ తరువాయి)

చెల్లించి వేలంపాటలో బార్లు దక్కించుకునే దౌర్భాగ్య పరిస్థితిని మద్యం వ్యాపారులు గతంలో చవిచూశారు.

వేలం పాట నిర్వహించడం ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరే పరిస్థితులున్నా అందుకు విరుద్ధంగా లాటరీ ద్వారా బార్లు కేటాయించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించడంపై ఆయా వ్యాపార వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బార్లు ఏర్పాటుకు సంబంధించి లైసెన్స్ ఫీజుల విషయంలో ప్రభుత్వం ముందు ఎక్సైజ్ శాఖ రెండు ప్రతిపాదనలు పెట్టింది. దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

ఖైదీలపై వివక్ష చూపరాదు

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్



సబ్ జైల్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

బెలగాం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఖైదీలపై సిబ్బంది, తోటి ఖైదీలు వివక్ష చూపరాదని జిల్లా సేవాఅధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం పార్వతీపురం సబ్‌జైల్‌లో ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వ హించారు. కృష్ణప్రసాద్ సబ్‌జైల్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలకు పలుచట్టాలపై అవగాహనకల్పించారు. జైలులోని ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జైలులోని ముద్దాయిలకు ఉచితసహాయం అందించడమే న్యా య సేవాధికార సంస్థ కర్తవ్యమని తెలిపారు. జైలులో సౌకర్యాలను అడిగి తె లుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెం ట్ పాల్గొన్నారు.

●బొబ్బిలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి సబ్‌జైలును జిల్లా సేవా అధి కార సంస్థకార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, సీనియర్ సివిల్‌న్యాయాధికారి ఎ.కృష్ణప్ర సాద్ శనివారం సందర్శించారు.ఈసందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడా రు.సబ్‌జైలులో బ్యారక్స్‌కిచెన్, స్టోర్‌రూమ్, శానిటేషన్ పరిశీలించారు. ఆయన వెంట జైలు విజిటింగ్ అడ్వకేట్ సీహెచ్ఎల్‌వి ప్రసన్నకుమార్ ఉన్నారు.

'సుభద్ర యోజన' నిధుల జమ



సుభద్ర యోజన నిధులు జమచేసే కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఒడిశా

రాయగడ, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): సుభద్ర యోజన పథకం కింద మూడోవిడతలో రాఖీ పండగ పురస్కరించుకుని ప్రతి మహిళ ఖాతాలో ఐదువేల రూపాయల చొప్పున రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ప్రభుత్వం జమచేసింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు ఏడాదిలో పదివేలు నగదు రెండు దఫాలుగా అందజేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద గతంలో రెండు సార్లు పదివేల రూపాయలు అర్హులైన మహిళల ఖాతాలో జమ చేసిన విషయం విదితమే. మూడోదఫా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి రాఖీపౌర్ణమి పురస్కరించుకుని శనివారం కోరాపుట్ జిల్లాలోని జైపూర్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా మహిళల ఖాతాలో జమ చేశారు. రాయగడలోని బిజూపట్నా యక్ ఆడిటోరియంలో అదనపుకలెక్టర్ నవీన్‌చంద్రనాయక్ సుభద్ర యోజన కింద నిధులు జమచేశారు. ముఖ్యమంత్రి స్విచ్ టిప్ ద్వారా 766 మంది మహిళల బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేశారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

రాయగడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక కోరారు. శనివారం రాయగడలోని జీసీడీ క్రీడా మైదానంలో గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మజ్జిగౌరి అమ్మవారి ఆలయం నుంచి ఆజ్ఞామాలను మేళతాళాలతో సభాస్థలానికి తీసుకొని వచ్చారు. అనంతరం సంప్రదాయ నృత్యగానాలతో వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగ్ , మాజీమంత్రులు లాల్‌బిహారిహిమిరిక, జగన్నాథ సరక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అదనపు జిల్లా కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

వీరఘట్టం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. వరి పైరుకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతు లు తెలిపారు. ఈ ఏడాది కిమ్మి, గడగమ్మ, కొట్టుగుమ్మడ తదితర గ్రామాల్లో నేటికీ వరి నాట్లువేయడం పూర్తికాలేదు. ఈ వర్షంతో ఆయాగ్రామాల్లో వరినాట్లు వేయ డానికి వీలుకలుగుతుందని రైతులు తెలిపారు. ఎదలకు వర్షంఉపయోగపడుతుందని చెప్పారు.